శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

సైలెన్స్

ముఖుపు తిరగబోతూ టే - ఒక్కసారి - ఎందుకోవెనక్కి తిరిగిచూడాలని మనసు కొట్టుకుంది.

చూశారు.

ఆ యిల్లు - బోసిగా ... దీనంగా.... కళావిహీనంగా.

ఆయనకు మళ్ళీ దుఃఖం వొచ్చింది. అసలే బరువుగా ఉన్న గుండె మరింత భారమైంది. కళ్ళల్లోకి నీళ్ళు వొచ్చాయి-అంతవరకూ అతి కష్టంమీద ఆపుకున్నవి.

భర్తనుకోల్పోయిన స్త్రీ....యజమానిని పోగొట్టుకున్న గృహమూ-బోడిగానూబోసిగానూకాక కిలకిలలాడుతూనూ కలకలలాడుతూనూ ఎలా ఉంటాయి? అందులోనూ రఘుపతిది అకాలమరణమూ, అసహజ మరణమూ.

పైపంచెతో కళ్ళుతుడుచు కున్నారు శ్రీనివాస రావుగారు. రఘుపతి భార్య గోడుగోడున విలపిస్తూ చెప్పిన మాటలే గుండెలో మార్మోగాయి.

"సాయంత్రం - మామూలుగా రోజూలానే సంచీ పట్టుకుని బజారుకి వెళ్లారు,ఆకాకరకాయలు తెస్తానని.అంతే... మరి తిరిగి రాలేదు. లారీకింద పడిపోయారని కబురొచ్చి పడింది పిడుగులా. వారికి చెముడు. మీకు తెలుసుకదా? ఎంతో మొత్తుకున్నాను చెవిలో మిషన్ పెట్టుకొండి. ఏళ్ళ తరబడి తినేస్తూంటే - ఓ పట్టాన ఒప్పుకున్నారుకారు. రేపీ ఘోరం జరుగుతుందనగా, ముందురోజు - ఏకళనున్నారో నా మాటవిని కంపెనీకి కర్డు రాశారు. అది వొచ్చేలోగానే యీ ఘోరం జరిగిపోయింది. లారీ డ్రయివరుది తప్పు లేదుట. హారన్ వేయనే వేశాట్ట. ఈయునకివినపడివుండదు. నాగీత యిలా ఉంటే" .. వలవల ఏడ్చిందామె. ఆ దుఃఖాన్ని చూసి- పరామర్శకు వెళ్ళకపోతేనే బాగుండేదేమో అనిపించింది. ఔను. పరామర్శంటే - మానుతున్న మానసిక గాయాన్ని మరోసారి కెలకడమేగా? కాని-ఎన్నాళ్ళనుంచో అతను స్నేహితుడు. రఘుపతీ తనూ సహోద్యోగులు. వెళ్ళకుండా ఎలా ఉండగలడు ?

పాపాత్ముడు పాముకాటుకి మరణిస్తాడుట. అదేమో కాని ప్రమాదంలో మరణించడం కంటె మరోపాపంలేదేమో! శరీరం నజ్జునజ్జు ఐ - బాధతో కొట్టుకుని - భయంకరంగా మరణించడం.... పోలీసులు శవాన్ని దహనానికివ్వకుండా పోస్టుమార్టమ్ అనీ, స్టేట్‌మెంట్లనీ ప్రాణాలు తియ్యడం.... ఎంత తతంగం అది! పాపం రఘుపతి భార్యా కొడుకూ ఎలా పడ్డారో యీ యాతనంతా. సమయానికి తను ఊళ్ళో లేడు.

మృత్యువు తాలూకు హెచ్చరిక లాటి లారీ హారన్- వినపడక చచ్చిపోవడం- ఎంత విచారించదగిన విషయం! ఎంత దయనీయ మయిన విషయం! రఘుపతి సహృదయుడు. సజ్జనుడు. సన్మార్గుడు. అటువంటి వాడి కిటువంటి దుర్మరణమా! ఉండుండి దేముడికి తిక్కరేగుతుందేమో. సృష్టించ దలచుకుంటే సవ్యమయిన మనుషుల్ని సృష్టించాలి. లేదా, చేతులుముడుచుకు కూర్చోవాలి. అంతేకాని అంధులనీ, బధిరులనీ, కుంటివాళ్ళనీ, పొట్టవాళ్ళనీ- అంగవికలురని సృష్టించడం దేనికీ పనిమాల?

"ఏసోక్క కోకకోలా....తీసోక్క రమ్మ్కు షోడా...."

పులిలా ఉరికింది పాట - మైకులోంచి. శ్రీనివాస రావుగారు ఉలిక్కిపడ్డారు. ఆయన గుండె అతి వేగంగా కొట్టుకుంది. భయంగా అయన చేత్తో గుండెపట్టుకుని, నడవడం మాని-నిలబడిపోయారు. ఓ నిముషానికి-స్వస్థత చిక్కింది. అప్పుడు - పాటవేపు చూశారు కోపంగా.

రోడ్డుపక్క - చిన్నపందిరి. అలంకారాలు. గణపతి బొమ్మ. ముందు ప్రమిదెలో దీపం. పక్కన మైకుసెట్టు. మైకులోంచి పాట.... "ఏసోక్క కోకకోలా...." గణపతి నవరాత్రులు....అనుకున్నారాయన జ్ఞాపకం వచ్చినట్లు. గణపతి

నవరాత్రులంటే.... మైకులు....రికార్డింగ్ డ్యాన్సులు....సినిమాలు....సందడి.

ఆయన కేదోఅర్థమైనట్లనిపించిందొక్కసారి. దేముడు నేడు వక్రసృష్టీ,వికృత సృష్టీ ఎందుకెక్కువగా చేస్తున్నాడో తెలిసిపోయినట్లనిపించింది. బూతు పాటలతో పూజించే.... బ్లూఫిలిములతో అర్చించే... రమ్ముతో అభిషేకంచేసి- స్త్రీ నగ్న శరీరాన్ని నైవేద్యం పెడుతున్న మానవాళికి దేముడు యింకేమిస్తాడు వక్ర వికృత సృష్టికాక? చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ అనలేదూ పెద్దలు? బూతుపాటలతోనూ, క్యాబరేడాన్సులతోనూ వినాయకుడికే మనోవైకల్యం తెప్పిస్తున్నారు మన మానవులు. అందుకే కాలం యిలా ఉందేమో.

ఆ పాట తాలూకు హోరువినలేక చెవులు మూసుకున్నారు. అడుగులు పడిగా వేయసాగారు. ఆయాసం వొస్తూంది కానీ, ఆ పాట తరమడం మానలేదు. ఇంకా వేగంగా నడవడం ఆయనకి సాధ్యంకావడంలేదు. ఆయన వయస్సు యాభై దాటి రెండుమూడేళ్ళే కాని ఏడాది కిందట ఆయనకి రక్తపుపోటూ గుండెదడా వొచ్చాయి. దానితో- వేగంగా నడవనూలేరు, ఎక్కువ శబ్దం భరించనూలేరు. ఆ పైన-పరామర్శ చేసి వొస్తున్నారేమో మనసు మరీ వికలమైంది. రిక్షాలో వెళ్ళేవారే యింటికి. కాని- యీ రోడ్లు ఆయనకి కొత్తకావు. గోతులుపడి-ఒకటే కుదుపు. ఇటువంటి రోడ్లమీద రిక్షాలో వెళ్తూంటే నరకమే కనపడుతుందడుగడుగునా. అయినా యిల్లు చాలా దూరమూకాదు.

క్లాసులో - ఏ మాత్రం గోలయినా-పాఠం చెప్పడం ఆపేసి-"సైలెన్స్" అని కేకవేస్తారు. ఆయన అరిస్తే-మామూలు మనిషి మాట్లాడినంత. ఉండుండి ఆయన కొక సందేహం వొస్తూంటుంది- "విజ్ఞానమూ నాగరికతా పెంచేసుకుంటున్నాం" అని విర్రవీగుతున్న నేటి మానవుడు నిజంగా ఎక్కడున్నాడు? ఇతనిపరుగు-ముందుకా, వెనక్కా? నిశ్శబ్దం తాలూకు సౌఖ్యమూ విలువా తెలుసుకోలేక-వాతావరణాన్ని మనిషి మెదడునీ కలుషితం చేసి వొదిలే శబ్దంపట్ల వీళ్ళెందుకిలా వెర్రిగా పిచ్చిగా పరుగు పెడుతున్నారు?

గ్రామఫోన్ .... టెలిఫోన్....మైకు....రేడియో....ఉపన్యాసాలు.... అన్నీ శబ్దాన్ని పెంచేవే ప్రపంచాన్ని ప్రశాంతంగా ఉండనివ్వక. చివరకు - సంగీతంలోకూడా శ్రావ్యతనీ సౌమ్యతనీ చంపేశారు-రాక్‌లు, స్టీరియోలు, డిస్కోలు-అంటూ అరుపులూ గోలా మొదలుపెట్టి హద్దుమీరిన శబ్దం-మనిషి మనసుని వికలం చేస్తుందన్న చిన్న విషయాన్ని గ్రహించి ఆచరించలేని యీ మనుషులది-జ్ఞానమా, అజ్ఞానమా? నాగరికతా, అనాగరికతా? పురోగమనమా, తిరోగమనమా?

నడుస్తున్నారు-శ్రీనివాసరావ్‌గారు. రోడ్డుపక్క మైకుల గోలలు,రోడ్డుమీద జనంగోల. రోడ్డుమధ్య వాహనాల అరుపులు. అన్నీకలసి ఆయన కర్ణభేరిని బద్దలు చేస్తున్నాయి. గుండెల నదరగొడుతున్నాయి.ఆయన వేళ్ళతో చెవులుమూసుకునినడుస్తున్నారు. పేవ్‌మెంట్లు దుకాణాలతో నిండగా,రోడ్డువారంగా నడుస్తున్నారు. ఆయనకి రఘుపతే గుర్తుకివచ్చాడు. ఒక్కసారాయన ఉలిక్కిపడ్డాడు.నిలువెల్లావొణికిపోయాడు.

రఘుపతి మరణానికి కారకుడు తనుకాదుకదా?

రఘుపతి భార్యకు తెలియదుకాని అతడు హియరింగ్ ఎయిడు పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు నిరుత్సాహపరుస్తూ వొచ్చింది తనే.

"చెవిలో చెట్టుమొలిచినట్లు ఆ ఎయిడూ, దానిపైరూ అదో పెద్దతతంగం. తీరాచేస్తే శబ్దం ఎలా ఉండేదలా వినిపించదు. పదింతలో పాతికింతలో ఐ- వినిపించి ప్రాణం తీస్తుందట. ఆ హోరు అతి దుర్భరమట. మనది మరీ పెద్ద నగరంకాదు. రోడ్డుమీద హారన్ వేయకూడదనే నిషిద్ధంలేదు సిటీలలోలాగ. లారీలు వరుగెడుతూంటే వొచ్చే శబ్దానికే పాదచారులు ప్రాణభీతితో పరుగెత్తాలి. అటువంటిది- లారీ హారన్ పాతికింతలో వందరెట్లో ఐ నీ ఎయిడులో వినిపిస్తే-గుండె ఆగిపోదూ? అయినా-నిశ్శబ్దంలో ఉన్న సుఖం శబ్దంలో ఎక్కడుంది? నిజం చెప్పాలంటే....నిన్ను చూస్తే నా కసూయ. వినపడక-హాయిగా ఉంటున్నావని. నాకే శక్తి ఉంటే-నా చెవులు నీ కిచ్చి నీ చెముడు నేను తీసుకునే వాణ్ణి. అయినా నీది మరీ బ్రహ్మ చెముడేమీకాదుగా. కొంత వినపడుతుందిగా—" అంటూ అతను హియరింగ్ ఎయిడ్ పెట్టుకోకుండా చేశాడు తను. అందువల్లనే ఆకస్మిక మరణం చెందాడేమో ప్రమాదంలో? పరోక్షంగా-రఘుపతిని తనే చంపాడా?

తనకి తానే నేరస్తుడిలా అనిపించి — పశ్చాత్తాపంతో భారమైన హృదయంతో — మెల్లగా నడుస్తున్నారాయన, కండువాతో కళ్లద్దుకుంటూ. చిన్న టౌన్లలో పేవ్‌మెంట్లు నామ మాత్రాలు. కూరల బుట్టలూ.. మిఠాయిబళ్లూ.... చిన్న చిన్న దుకాణాలూ ఉంటాయి పేవ్‌మెంట్లమీద. నడిచే వారికి చోటుండదు. చేతిలో పైసలుపడ్డాక పోలీసులు రూల్సుని మరచిపోతారుమరి.

శబ్దంమీద ద్వేషంతో.... కోపంతో.... నిశబ్దంమీద వల్లమాలిన ప్రీతితో.... అభిమానంతో.... నా యిష్టాయిష్టాలతో... సిద్ధాంతాలతో.... మిత్రుడివైన నిన్ను నేనే చంపేశానా రఘురాం? నీసమాధికి నేనే పునాది వేశానా? నన్ను క్షమించవూ? "గొణుక్కుంటూ- పరధ్యానంగా నడుస్తున్నారు. ఆయనకి చాలాదుఃఖం వొస్తూంది. మనసు- దేనికో మధన పడుతూంది. పక్కన ఎవరో బిగ్గరగా మాట్లాడేసరికి- యాంత్రికంగా- "సైలెన్స్....నోనాయస్ ...." అంటూ అరిచారు క్లాస్‌రూమనుకుని. అంతలో వాస్తవం గుర్తించి-అలవాటులో పొరపాటనుకుని-సిగ్గుపడుతూ నాలిక కరుచుకున్నారు. ఇంటి దగ్గరా యింతే ఆయన. ఇల్లాలయినా సరే గట్టిగా మాట్లాడితే యిలాగే— "సైలెన్స్" అనిఅరుస్తారు. అందుకే ఆయనకి- "సైలెన్స్ మాస్టారు" అని నిక్‌నేమ్ పెట్టారు విద్యార్థులు. సైన్స్‌మాస్టారిగా కంటె — "సైలెన్స్ మాస్టారు'' గానే ఆయన ఎక్కువ ప్రసిద్ధిచెందారు స్కూల్లో.

శ్రీనివాసరావ్‌మాస్టారి కేక-"సైలెన్స్-" డ్రయివర్ వినిపించిందో లేదో కాని- ఒక్కసారి ఆయన పక్కగా- చెవి దగ్గర.... బిగ్గరగా....కర్కశంగా....దిక్కులుపిక్కటిల్లేలా.... లారీహారన్!

ఆక్షణంలో- ఆయన- కళ్ళుమూసుకుందుకు రెప్పలనిచ్చి రక్షించినదేముడుచెవులుమూసుకుందుకు దొప్పలనెందుకివ్వలేదు మనిషికని ఆలోచిస్తున్నారు. లారీహారన్....ఆయన ముఖం ఎర్రబడి....నిలువెల్లా చెమటలు పట్టి ... ఊగిపోయి కూలిపోతూ- "సై...." అన్నారంతే. మాటపూర్తికాలేదు. మనిషి కూలిపోయారు.

జనం- ఆగి- ఆయన చుట్టూ మూగారు. లారీ ఆపి డ్రయివరూ పరుగెత్తుకొచ్చాడు కంగారుగా భయంగా ఆశ్చర్యంగా. "బండికి.... బాడీకి ... మనిషి టచ్చయినా కాలేదే!"

"మనిషి చచ్చి పోయారు-" ఎవరో నిర్ధారించారునాడి చూసి.

"షాక్...."

"హార్ట్ అటాక్...."

ఏదేమయినా- శ్రీనివాసరావ్‌మాస్టారు- శాశ్వతంగా సైలెన్సయిపోయారు.

కలల పక్షులు

శ్రీ కె. దినకర్

ఉదయాద్రి శిఖరం నుండి
చీకటి లోకంలోకి
ఉరికే అనంతకాంతి స్రవంతి
విసరే కిరణాల తుంపరులకు-
నిద్ర అనే చెట్టు కొమ్మకు
నిశ్చలంగా వ్రేలాడే
కళ్ళ గూళ్ళలోని
కలల పక్షు లెగిరి పోతాయి నిశ్శబ్దంగా
భావాకాశ వీధుల్లోకి
జీవితానుభవాల దిశాంచలాల్లోకి!